# మగాడి వ్యక్తిత్వం

■ అనిసెట్టి శ్రీధర్

వచ్చేస్తోంది.
వచ్చేస్తోంది.
వచ్చేస్తోంది.
ఏమిటది? పులా? ప్రళయమా?

"ఏమండీ పదిహేనో తారీఖు వచ్చేస్తోంది. చెప్పిన పనులన్నీ చేశారా?" ఇది ఏ నాలుగోసారో ఆనందరావుని భార్య అడగడం. అలా గుర్తు చేసినప్పుడల్లా వెయ్యి హార్ట్ ఎటాక్‌లు ఒక్కసారే వచ్చినట్టు ఉంటోంది ఆనందరావుకి.

పదిహేనో తారీఖు వచ్చేస్తోంది.

మనిషి మనిషిలా ఉండలేకపోతున్నాడు. కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. మార్చి పదిహేనో తారీఖు వచ్చేస్తోంది.

పదిహేనో తారీఖు రాకుండా ఉంటే ఎంత బాగుంటుంది. కానీ, రాకుండా ఎలా ఉంటుంది.

2000 మార్చి పదిహేను వచ్చేస్తోంది.

గ్రహాల చలనం వల్లో, మరో దాని వలనో ఈ సంవత్సరం మార్చి పదిహేను ఉండదనీ, పద్నాలుగో తారీఖు తర్వాత పదహారో తారీఖుగా భావించాలనీ ఏ ఖగోళ శాస్త్రవేత్తలో ప్రకటిస్తే ఎంత బాగుంటుంది. తనకి ఏ ప్రమాదమో జరిగి ఆ ఒక్క రోజూ కోమా లోకి వెళిపోకూడదా? ఇంతకూ మార్చి పదిహేనో తారీఖంటే ఆనందరావుకి ఎందుకంత భయం? కాదు, ఎందుకు కంగారు. కాదు, ఎందుకు అనీజీనెస్.

ఆ రోజు ఆనందరావు చావు రాసి పెట్టుందని ఏ జ్యోతిష్కుడయినా చెప్పాడా? ఆనందరావుకి ఎయిడ్స్ ఉందో, లేదో వైద్యులు ఆరోజు నిర్ధారిస్తామన్నారా? లక్షల ఆస్తి అతనిదో, కాదో ఏ న్యాయస్థానమయినా తీర్పు ఇవ్వబోతోందా?

ఇవేవీ కావు.

మరి!

మార్చి పదిహేను ఆనందరావు పుట్టిన రోజు.

పుట్టిన రోజు వస్తోందంటే ఆనందరావుకి ఎందుకు భయం?

*　　*　　*

మొగుళ్ళు పాపాల్జేస్తుంటే పాపపరిహారం కోసం పెళ్ళాలు పూజల్జేస్తుంటారు. ఆనందరావు భార్య పూజల్జేస్తుంటుంది.

'నీ బలహీనతలేమిటో చెప్పు' అని ఎవరినడిగినా సమాధానాలు ఇలా ఉంటాయి.

'ప్రతివాళ్ళనీ నమ్మడమే నా బలహీనత.'

'అడిగిన వాళ్ళందరికీ అప్పులిచ్చేస్తుంటాను.'

'ప్రాణం పోయినా అబద్ధం చెప్పను.'

'నాకు అన్యాయం చేసిన వాడిని క్షమించి వదిలేస్తాను.'

అంతే కానీ-

- ఉచితంగా దొరికితే మందు కొట్టెయ్యాలనుంటుందనీ,
- టి.ఏ (ట్రావెలింగ్ ఎలవెన్స్) బిల్‌లో అయిన దాని కన్నా ఒక వంద రూపాయలు ఎక్కువ కలిపేస్తాననీ,
- గుర్రప్పందాలంటే మోజనీ,
- కుల గజ్జి ఉందనీ,
- పేకాట ప్రియుణ్ణనీ,
- సెక్సు కథలు చదువుతాననీ,
- ఆడదంటే పడి చస్తాననీ ఎవరూ చెప్పుకోరు.

అయితే-

ఆనందరావింట్లో మినీ బార్ ఉంది.

ఆనందరావు కంపెనీల్లో పనిచేసే అయిదుగురు ఎగ్జిక్యూటివ్‌లు, పదిహేను మంది సెక్షన్ హెడ్‌లు, యాభై మంది గుమాస్తాల్లో కొంత మంది టి.ఏ బిల్సు పెడుతుంటారు.

ఆనందరావు కష్టజీవి. రేసుల్లో కాసులు గెలవాలనుకునే వాడు కాదు.

ఆనందరావుకి పేకముక్కలు పట్టుకోవడం కూడా రాదు.

ఆడవాళ్ళంటే ఆనందరావు పడిచస్తాడని కిట్టనివాళ్ళు అంటుంటారు. ఆడవాళ్ళే ఆనందరావంటే పడిచస్తారని అభిమానులు అనుకుంటారు.

ఆడవాళ్ళు నాలుగు రకాలని ఆనందరావు థీరీ.

అందం ఉండి ఆనందాన్నిచ్చేవాళ్ళు- స్వర్గంలో ఉండదగినవాళ్ళు. ఆనందరావు అప్పుడప్పుడూ స్వర్గంలో విహరిస్తుంటాడు.

అందం ఉండీ ఆనందాన్నివ్వని వాళ్ళు- మ్యూజియంలో పెట్టాలి. ఆనందరావుకి మ్యూజియం అంటే ఇష్టం లేదు.

అందం లేకున్నా ఆనందాన్నిచ్చే వాళ్ళు- రిజర్వ్‌లో ఉంచాలి. ప్రమీల రిజర్వ్ కాండిడేట్.

అందమూ లేకా ఆనందాన్నీ ఇవ్వనివాళ్ళు - నరకంలో ఉండాలి.

నరకానికెళ్ళాలని ఎవరు కోరుకుంటారు?

ఆనందరావు కంపెనీలో పనిచేసే టైపిస్ట్ ప్రమీల ఆనందరావుకి కంపెనీ ఇస్తుంటుంది. ఆనందరావు ఇచ్చిన బహుమతులు పుచ్చుకుంటూ ఉంటుంది. ఆనందరావు తనకి ఎప్పటికీ బహుమతులు ఇస్తూనే ఉంటాడని ఆమె అనుకోలేదు. ఆనందరావు తనని (రెండో) పెళ్ళి కూడా చేసుకోడని మరీ కచ్చితంగా తెలుసు. అందుకే ఎవడో కువైట్ వాణ్ణి తగులుకుని వెళ్ళిపోయింది. వెళ్ళే ముందు ఆనందరావుకి తన పక్క ఇంట్లో ఈమధ్యనే దిగిన సుగుణని పరిచయం చేసి మరీ వెళ్ళింది.

ఆనందరావు పుట్టినరోజుకీ, సుగుణకీ ఏమిటి సంబంధం?

*　　*　　*

సుగుణ మంచి పిల్ల. తాడుని చూసి పామనుకుని భయపడే పిరికిపిల్ల. పాముని చూసి తాడని భ్రమపడే వెర్రిపిల్ల. పాముకి దణ్ణం పెడితే కాటేయదని నమ్మే పిచ్చిపిల్ల.

సుగుణ బీదరాలు. ఆమెకి డబ్బు చాలా అవసరం. ఉద్యోగం ఇంకా ఎంతో అవసరం.

సుగుణ అందగత్తె. ఆమె అందం చాలామంది మగవాళ్ళకి అవసరం. వన్‌నైట్ స్టాండ్ ఇంకా ఎంతో అవసరం.

సుగుణ గుణగణాలూ (అనగా మంచితనం+ పిరికితనం+ వెర్రితనం+ పిచ్చితనం), అందాలూ, అవసరాలూ- అన్నీ ఒక్క చూపులో గ్రహించేశాడు ఆనందరావు. ప్రమీల సుగుణకు సాటి రాదు. ఈ మాట ఎవరూ చెప్పక్కర్లేదు.

సుగుణ ప్రమీలలాంటిది కాదు. ఈ విషయం ఆనందరావూ గ్రహించాడు. ప్రమీలా చెప్పింది.

ఆనందరావు ఎలాంటివాడో సుగుణ గ్రహించ లేదు. ప్రమీలా చెప్పలేదు.

సుగుణ ప్రమీలని ఆనందరావు కంపెనీ గురించి అడిగింది.

ఆనందరావు కంపెనీలో ఖాళీలొస్తుంటాయని ప్రమీల సుగుణకి చెప్పింది.

సుగుణ అడిగిన విషయాన్ని ప్రమీల ఆనందరావుకి చెప్పింది.

సుగుణకి తప్పక సహాయం చేస్తానని ప్రమీలతో ఆనందరావు చెప్పాడు.

సుగుణ- ప్రమీల- ఆనందరావు.

ఆనందరావు - ప్రమీల - సుగుణ.

మధ్యలో ఉన్న ప్రమీల వెళ్ళిపోయింది. సుగుణని మరో ప్రమీలని చేసెయ్యాలని ఆనందరావు నిశ్చయించేసుకున్నాడు.

ఏ పనికయినా ముహూర్తం కుదరాలి. మార్చి పదిహేను 1999 అంటే సుమారు సంవత్సరం క్రితం ముహూర్తం కుదిరింది.

*　　*　　*

మార్చి పదిహేను, 1999. ఆనందరావు నలభయ్యో పట్టిన రోజు.

ఆనందరావు పచ్చటి సఫారీ సూటులో తురాయి చెట్టులా ఉన్నాడు. తురాయి పూల రంగు పట్టుచీర కట్టుకుంది ఆనందరావు భార్య. భార్యాభర్తలిద్దరూ గుడికి వెళ్ళి అర్చన చేయించారు. పరమ పవిత్రమైన మనసులతో బయటకు వచ్చారు.

భార్యని ఇంటి దగ్గర దింపి కారులో ఆఫీస్‌కి వెళ్ళున్న దారిలో ఒక చోట మల్లెలు గుప్పుమన్నాయి. మొదటిసారి కలుసుకున్నప్పుడు జడలో మల్లెచెండు తురుముకున్న సుగుణ గుర్తుకువచ్చింది.

సుగుణ.

ఆకాశాన్నంటడానికి లేచిన అలలా కోరిక ఎగిసిపడింది. గుళ్ళో ఆవరించిన పవిత్రభావం ఎటో ఎగిరిపోయింది.

'ఎంతకాలం ఇలా? ఇవాళ తేల్చెయ్యాలి' అనుకుని కారుని సుగుణ ఉండే కాలనీ వైపు తిప్పాడు.

సుగుణ ఒప్పుకోదు. బలవంతంగానైనా ఒప్పించాలి. బలవంతంగానైనా...

*　　*　　*

తలుపు తీసిన సుగుణ కల్మషం ఎరుగని పాపాయిలా ఉంది. పాలలా తెల్లగా ఉంది.



చిత్రాలు: నర్సిం

**సుగుణ కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆ ఏడుపులోనే ఆమెలోని కొన్ని 'సుగుణాలు' కొట్టుకుపోయాయి. తగిలిన ఎదురుదెబ్బ ఆమెలోని అమాయకత్వాన్ని తన్ని తరిమేసింది. అప్పుడు కనిపించింది ఆమెకు మంచం మీద తెగి పడిన బంగారు మొలతాడు!**

ఆనందరావు కళ్ళకి ఏపుగా పెరిగిన చెరుగ్గడలా ఉంది. పచ్చటి సఫారీ సూటులో ఆనందరావు పడగ విప్పిన పాములా ఉన్నాడు. తాడని భ్రమపడిన సుగుణ దారి ఇచ్చింది.

"ఒక్కదానివే ఉన్నట్టున్నావ్" అన్నాడు ఆనందరావు ఆనందాన్ని అణుచుకుంటూ.

"అవునండీ. అమ్మా, నాన్నా ఊరు వెళ్ళారు. రేపొస్తారు" అంది.

పర్‌ఫెక్ట్ సెట్టింగ్.

ఆ మాటకి ఆనందరావు సంతృప్తిగా ఎందుకు తలాడించాడో అర్థం కాలేదు అమాయకురాలికి.

"నీకు టైపింగ్ వచ్చా?"

"సర్టిఫికెట్స్ తెస్తానండీ" అంటూ లోపలి గదిలోకి వెళ్ళబోయింది.

"అహఁహఁ. నాకు సర్టిఫికెట్స్ అవసరం లేవు. పనితనం కావాలి. ఏవీ నీ వేళ్ళు చూడనీ" అంటూ సుగుణ చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

సుగుణ బిత్తరపోయింది.

"నీ వేళ్ళు మరీ నాజూగ్గా ఉన్నాయి. కంప్యూటర్ మీద టైప్ చేద్దువులే. కంప్యూటర్ కీ బోర్డ్ హార్డ్‌గా ఉండదు. మెత్తగా ఉంటుంది నీ ఒంటిలా" అంటూ ఒంటి మీద చెయ్యి వేశాడు.

సుగుణ కొయ్యబారిపోయింది.

"ఇక్కడ మరీ ఉక్కగా ఉంది" అంటూ సఫారీ బట్టలు విప్పేశాడు- పాము కుబుసం విడిచినట్లు.

"నీకూ ఉక్కగా లేదూ" అన్నాడు. హఠాత్తుగా చెయ్యి జాపి సుగుణ చీర లాగేశాడు.

మొదటిసారి నెత్తురు రుచి చూడబోతున్న పులిలా ఉన్నాడు.

పామని తెలుసుకున్న సుగుణ దణ్ణం పెట్టింది.

ఆనందరావు కామంతో కంపించిపోతున్నాడు. సుగుణ భయంతో వణికిపోతోంది. సుగుణ ఒంటి మీద బట్టలు పీలికలయ్యాయి. బహిర్గతమవుతున్న సుగుణ అందాలు చూసి పిచ్చెక్కిపోయాడు.

ఆనందరావులో కోరిక సముద్రమంత పెద్దదైంది.

హిమాలయమంత ఎత్తు ఎక్కి కూర్చుంది.

కొండచిలువలా సుగుణని చుట్టేశాడు.

ఏ క్షణికానందం కోసమని పసిపాప నుండి ప్రౌఢ దాకా మగాడి కామానికి బలవుతున్నారో, ఆ తాపత్రయం ముగియగానే-

ఆనందరావు మనసుని పశ్చాత్తాపం దహించివేయడం మొదలయింది.

సుగుణ వెక్కివెక్కి ఏడుస్తోంది.

"సుగుణా!" మాట పెగలని స్వరంతో సుగుణ దగ్గరకెళ్ళబోయాడు. సుగుణ నిప్పులు కక్కేలా చూసింది.

ఆనందరావు పారిపోయాడు.

తర్వాత సుగుణ కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆ ఏడుపులోనే ఆమెలోని కొన్ని 'సుగుణాలు' కొట్టుకుపోయాయి. తగిలిన ఎదురుదెబ్బ ఆమెలోని అమాయకత్వాన్ని తన్ని తరిమేసింది. అప్పుడు కనిపించింది ఆమెకు మంచం మీద తెగి పడిన బంగారు మొలతాడు!

ఆనందరావుది.

దీర్ఘంగా ఆలోచించింది.

జరిగింది ఒక పీడ కలగానో, కూతురికి జరిగిన ఏక్సిడెంట్‌గానో భావించి తల్లీ తండ్రీ తనకు తోడుగా ఉండరు. వ్యథతో శవాలవుతారు. అలా జరగడం తాను భరించలేదు.


కఫాన్ని కాండ్రించి ఉమ్మేసినట్టు జరిగినదాన్ని మనసులో నుండి తుడిచేసింది.

ఆ బంగారు మొలతాడుని చేత్తో ముట్టుకోకుండా గుడ్డలో చుట్టి మురిక్కాలవలో పారేసింది.

తలారా స్నానం చేసింది.

*   *   *

సామ, దాన, భేద, దండోపాయాల్లో మొదటి



మూడింటినీ ఆనందరావు సమర్థిస్తాడు. అవసరమైతే పాటిస్తాడు.

లంచం ఇవ్వడం, ఇష్టపడిన ఆడదాన్ని పక్క మీదకు లాగెయ్యడం, వ్యాపారంలో ఎదుటివాడిని తొక్కెయ్యడం- ఇవన్నీ ఆనందరావు దృష్టిలో పాపాలు కావు. అడ్డొచ్చిన శాల్తీని తీసెయ్యడం, ఆడదాన్ని బలవంతం చెయ్యడం- ఇవి పాపాలే. అంచేత ఆనందరావు దృష్టిలో ఆనందరావు మొదటిసారి పాపం చేశాడు.

ఆనందరావు పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఎంతగా కుమిలిపోయాడంటే ఎవరేనా అతని మనసులోకి తొంగి చూడగలిగుంటే మానవ చరిత్రలో ఎవరూ ఏ తప్పుకీ ఇంతగా పశ్చాత్తాప పడుండరని అనుకునే వాళ్ళు. పాప పరిహారంలో భాగంగా పంపిన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో సుగుణ ఉద్యోగంలో చేరింది.

మగడు మొలతాడు వేసుకున్నాడో లేదో, ఉందో ఊడిందో పెళ్ళానికి తప్పకుండా తెలుస్తుంది. అందుకే మొలతాడు లేని విషయాన్ని భార్యకు చెప్పకుండా దాచి పెట్టలేదు. బాత్‌రూమ్‌లో తెగిపడి కాలవలోకి జారిపోయిందన్నాడు.

"అయ్యో, వెతికిద్దాం" అంది. ఆనందరావు గతుక్కుమన్నాడు.

"ఛ ఛ పోతే పోయింది. ఆ అసయ్యంలో ఎందుకు" అన్నాడు.

'ప్చ్... రెండు సవర్ల బంగారం' అనుకుంది. పోయింది రెండు సవర్ల బంగారం కాదనీ, రెండు పదుల వయసున్న అమ్మాయి బంగారం లాంటి అభిమానమనీ ఆమెకు తెలియదు.

తన భార్య దగ్గరకి బంగారు మొలతాడు తీసుకొచ్చి సుగుణ అల్లరల్లరి చేస్తుందేమోననే భయంతో పశ్చాత్తాపం ఎక్కువైపోయింది.

సుగుణ కనిపించినప్పుడల్లా ఎవరూ చూడకుండా ఆమె కాళ్ళ మీద పడిపోయి క్షమాపణ వేడుకుందా మనుకునేవాడు.

కాళ్ళమీద పడగానే, "మీ స్థానం అక్కడ కాదండీ, ఇక్కడ" అంటూ తనని లేవనెత్తి హృదయానికి హత్తుకుని సుగుణ మరో ప్రమీల కాకపోతుందా అనే ఆశ కూడా ఉండేది. అప్పుడు తాను చేసింది తప్పు కాదని తృప్తిగా ఉండేది. అయితే, సుగుణ ఆ అవకాశమే ఇవ్వకుండా ఆనందరావుని పురుగుని చూసినట్టు చూసేది. ఆ చూపులో కనిపించే ఏహ్య భావం ఆనందరావు పశ్చాత్తాపాన్ని రెండు పెట్టి హెచ్చు వేస్తూ ఉండేది. కాల్చేసేలా ఉండే సుగుణ చూపులు రోజూ భరించలేక వేరే బ్రాంచ్‌కి బదిలీ చేశాడు.

మొలతాడు కథని ఇంటికొచ్చిన బంధువులందరికీ ఆనందరావు భార్య విడమర్చి చెబుతుంటే, ఆనందరావుకి ముళ్ళమీద కూర్చున్నట్టుండేది. ఎవడేనా కుతూహలరావు బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మొలతాడు కాలవలోకి వెళ్ళడానికి అవకాశం ఉందా లేదాని పరిశోధన ప్రారంభిస్తే వెండి చెంబుతో వాడి నెత్తిన ఠపీమని మోదాలనిపించేది.

పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు.

బరువు తూచే యంత్రంలా మనుషులు చేసే పాపాన్ని తూచే యంత్రం కూడా ఉండి ఉంటే ఆనందరావు రేప్‌చేసీ చేయగానే ఎకాయెకిని పాపం బరువు ఎంతో చూసేసుకుని పశ్చాత్తాపం పొందుతూనే ఎంత బరువు తగ్గేడో చూసుకునే వీలుండేది.

పుట్టిన రోజునాడో, పెళ్ళినాడో గుడికి వెళ్ళేవాడు ఇప్పుడు వారానికి మూడుసార్లు వెళుతున్నాడు. ఆఫీస్‌కి వెళ్ళేముందు ఒక దణ్ణం పారేసే అలవాటు కాస్తా ఉదయాన్నే అరగంట పూజకు ఎదిగింది.

పూజలో కాలిపోతున్న కర్పూరాన్ని చూసినప్పుడల్లా ఆనందరావు తన హృదయం కూడా అలా పశ్చాత్తాపం అనే మంటలో మండిపోయి మేలిమి బంగారంలా తయారవుతుందని ఆశపడేవాడు.


ఆనందరావు జీవితాన్ని ఎవరేనా సినిమాగా తీస్తే సినిమా మొత్తానికీ పశ్చాత్తాపం సీన్ హైలైట్ అవుతుంది. ముఖ్యంగా కర్పూరం అరచేతిలో కాలిపోతుండగా హీరో పశ్చాత్తాపపడుతూ నరాల్తెగిపోయేలా పాట పాడుతుంటే ప్రేక్షకదేవుళ్ళు కనకవర్షం కురిపిస్తారు.

కర్పూరం సెంటిమెంట్ ప్రేక్షకుల మెదళ్ళకు (మనసుకి కాదు) ఎంత బాగా హత్తుకుపోతుందంటే దేశంలో కర్పూరం నిల్వలు తగ్గిపోయి, కర్పూరం నల్ల బజారుకి తరలిపోయి ప్రభుత్వం లెవీ కర్పూరాన్ని చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ చేయాల్సొస్తుంది.

నోట్లో నోట్లో అనుకునేవాడు మంత్రాలు ఎలుగెత్తి చదువుతున్నాడు. బిజినెస్ టూర్‌ల కన్నా భక్తి టూర్‌లు ఎక్కువయ్యాయి. ఇదంతా గమనిస్తోన్న ఆనందరావు భార్యకి భయమేసి బెంగపెట్టుకుని, "మా వారిని మామూలు మనిషి చెయ్యి స్వామీ" అని భగవంతుడిని ప్రార్థించింది. మరో రెండు రోజుల్లో మార్చి పదిహేను, 2000 వస్తోంది.

పుట్టినరోజు పార్టీకి కావలసిన ఏర్పాట్లన్నీ చేశారా అని భార్య గుర్తుచేస్తోంటే ఆనందరావులో అలజడి పెరిగిపోతోంది. సంవత్సరం క్రితం తాను పాపం చేసిన రోజు వస్తోందంటే అసహనంగా ఉంటోంది.

'జీవితాన్ని మళ్ళీ ప్రారంభించగలిగితే ఎంత బాగుంటుంది. కనీసం ఈ ఒక్క సంవత్సర కాలం వెనక్కు మళ్ళితే చాలు. ఆ తప్పు చెయ్యకుండా నడుచుకుంటాను.



**సినిమాల్లో చూపించినట్టు పాత్రలూ, సన్నివేశాలూ వెనక్కు మళ్ళినట్లో, కంప్యూటర్‌లో చేసినదంతా అన్ డు ఆప్షన్‌తో చెరిగిపోయినట్లో తన జీవితంలో కూడా అద్భుతం జరక్కూడదా అని మథన పడ్డాడు.**

ఒక్క
అవకాశం ఇవ్వు భగవంతుడా' అని ఈ సంవత్సర కాలంలో ఆనందరావు చాలాసార్లు వేడుకున్నాడు.

సినిమాల్లో చూపించినట్టు పాత్రలూ, సన్నివేశాలూ వెనక్కు మళ్ళినట్లో, కంప్యూటర్‌లో చేసినదంతా అన్ డు ఆప్షన్‌తో చెరిగిపోయినట్లో తన జీవితంలో కూడా అద్భుతం జరక్కూడదా అని మథన పడ్డాడు.

భగవంతుడు తలుచుకుంటే విచిత్రాలకూ, లీలావినోదానికీ కొదవా! మార్చి పధ్నాలుగు, 2000 అర్ధరాత్రి ఒక మహాద్భుతం జరిగిపోయింది. ప్రపంచమంతా లిప్త పాటు ట్రాన్స్‌లోకి వెళ్ళి మళ్ళీ మెలకువలోకి వచ్చింది. కాలం ఒక సంవత్సరం వెనక్కు వెళ్ళిపోయిన సంగతి ఎవరికీ తెలీదు. ఆనందరావుక్కూడా తెలీదు.

* * *

గిరుక్కున వెనక్కు తిరిగి వచ్చిన మార్చి పదిహేను, 1999. ఆనందరావు నలభయ్యో పట్టినరోజు.

ఆనందరావు పచ్చటి సఫారీ సూటులో తురాయి చెట్టులా ఉన్నాడు. తురాయి పూలరంగు పట్టుచీర కట్టుకుంది ఆనందరావు భార్య. భార్యాభర్తలిద్దరూ గుడికి వెళ్ళి అర్చన చేయించారు. పరమ పవిత్రమైన మనసులతో బయటకు వచ్చారు.

భార్యని ఇంటి దగ్గర దింపి కారులో ఆఫీస్‌కి వెళ్తున్న దారిలో ఒకచోట మల్లెలు గుప్పుమన్నాయి. మొదటిసారి కలుసుకున్నప్పుడు జడలో మల్లెచెండు తురుముకున్న సుగుణ గుర్తుకువచ్చింది.

సుగుణ. ఆకాశాన్నంటడానికి లేచిన అలలా కోరిక ఎగిసిపడింది. గుళ్ళో ఆవరించిన పవిత్రభావం ఎటో ఎగిరిపోయింది.

'ఎంతకాలం ఇలా? ఇవాళ తేల్చెయ్యాలి' అనుకుని కారుని సుగుణ ఉండే కాలనీ వైపు తిప్పాడు. సుగుణ ఒప్పుకోదు. బలవంతంగానైనా ఒప్పించాలి. బలవంతంగానైనా...

ఎవరో చప్పట్లు కొట్టి పేరుపెట్టి తనని పిలిచి నట్టనిపించి, కారు ఆపి దిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు.

* * *

తలుపు తీసిన సుగుణ కల్మషం ఎరుగని పాపాయిలా ఉంది. పాలలా తెల్లగా ఉంది. ఆనందరావు కళ్ళకి ఏపుగా పెరిగిన చెరుగ్గడలా ఉంది.

ఆనందరావు పచ్చటి సఫారీ సూటులో పడగవిప్పిన పాములా ఉన్నాడు. తాడని భ్రమపడిన సుగుణ దారి ఇచ్చింది.

"ఒక్కదానివే ఉన్నట్టున్నావ్" అన్నాడు ఆనంద రావు ఆనందాన్ని అణుచుకుంటూ.

"అవునండీ. అమ్మా, నాన్నా ఊరు వెళ్ళారు. రేపొస్తారు."

పర్‌ఫెక్ట్ సెట్టింగ్.

ఆ మాటకి ఆనందరావు సంతృప్తిగా ఎందుకు తలాడించాడో అర్థం కాలేదు అమాయకురాలికి.

"నీకు టైపింగ్ వచ్చా?"

"సర్టిఫికెట్స్ తెస్తానండీ" అంటూ లోపలి గదిలోకి వెళ్ళబోయింది.

"అహఁహఁ. నాకు సర్టిఫికెట్స్ అవసరం లేవు. పనితనం కావాలి. ఏవీ నీ వేళ్ళు చూడనీ" అంటూ సుగుణ చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

సుగుణ బిత్తరపోయింది.

లోపలి గదిలో అలికిడయినట్టనిపించింది.

చెయ్యి వదిలేశాడు.

"ఏమిటా శబ్దం?"

"శబ్దమా! ఏం లేదే" అంది సుగుణ.

'మరి తనకి అంత స్పష్టంగా వినిపించిందేమిటి' అనుకున్నాడు ఆనందరావు.

మళ్ళీ చెయ్యి తన చేతిలోకి తీసుకుని, "నీ వేళ్ళు మరీ నాజూగ్గా ఉన్నాయి. కంప్యూటర్ మీద టైప్ చేద్దువుగానిలే. కంప్యూటర్ కీ బోర్డ్ హార్డ్‌గా ఉండదు. మెత్తగా ఉంటుంది నీ ఒంటిలా" అంటూ ఒంటి మీద చెయ్యి వేశాడు.

సుగుణ కొయ్యబారిపోయింది.

"ఇక్కడ మరీ ఉక్కగా ఉంది" అంటూ సఫారీ బట్టలు విప్పేశాడు- పాము కుబుసం విడిచినట్టు.

"నీకు ఉక్కగా లేదూ" అన్నాడు. హఠాత్తుగా చెయ్యి జాపి సుగుణ చీర లాగేశాడు. మొదటిసారి నెత్తురు రుచిచూడబోతున్న పులిలా ఉన్నాడు.

పామని తెలుసుకున్న సుగుణ దణ్ణం పెట్టింది.

ఆనందరావు కామంతో కంపించిపోతున్నాడు. సుగుణ భయంతో వణికిపోతోంది.

లోపలి గదిలో మళ్ళీ అలికిడయినట్టనిపించింది. ఆనందరావు ఆగాడు. "లోపల ఎవరన్నా ఉన్నారా?" అనుమానంగా అడిగాడు.

"ఎ... ఎవరూ లేరు" అంది. మా మావయ్య వచ్చాడు ఊరు నుండి అని అబద్ధం చెప్పి తప్పించుకునే తెలివితేటలు లేని పిచ్చి తల్లి.

సుగుణ ఒంటి మీద బట్టలు పీలికలయ్యాయి. బహిర్గతమవుతున్న సుగుణ అందాలు చూసి పిచ్చెక్కిపోయాడు.

మనసు ఏవో సంజ్ఞలు చేస్తోంది. కానీ, మెదడు వాటిని అందుకోలేకపోతోంది.

ఆనందరావులో కోరిక సముద్రమంత పెద్దదైంది.

హిమాలయమంత ఎత్తు ఎక్కి కూర్చుంది.

తప్పంటున్న మనసుని అగాధంలోకి తోసేశాడు.

కొండచిలువలా మారి సుగుణని చుట్టేశాడు.

ఏ క్షణికానందం కోసమైతే పసిపాప నుండి ప్రౌఢ దాకా మగాడి కామానికి బలవుతున్నారో- ఆ తాపత్రయం ముగియగానే - ఆనందరావు మనసుని పశ్చాత్తాపం దహించివేయడం మొదలైంది. సుగుణ వెక్కివెక్కి ఏడుస్తోంది.

"సుగుణా..." మాట పెగలని స్వరంతో సుగుణ దగ్గరకెళ్ళబోయాడు. సుగుణ నిప్పులు కక్కేలా చూసింది.

ఆనందరావు వెంటనే పారిపోలేదు. మనసు ఇందాకటి నుండీ చేస్తున్న సంజ్ఞ ఏమిటో ఇప్పుడు అర్థమైందను కున్నాడు. 'వార్నీ ఇదా' అనుకున్నాడు. ఆనందరావు మనసులో ఇప్పుడు పశ్చాత్తాపమే కానీ భయం లేదు.

ఎంచేతనంటే - సుగుణ ఇంటి నుండి బయట పడిన ఆనందరావు- చేతిలో విలాసంగా తిప్పుతూ వేలికి చుట్టుకుంటున్నదేమిటో తెలుసా?

తెగిన బంగారు మొలతాడు!

భగవంతుడు తెల్లబోయాడు. ■